మంత్రి 'మండిపల్లి'ని కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి -రాయచోటి

రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్ చామకూరి సోమవారం రాయచోటి పట్టణంలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేసి అన్నమయ్య జిల్లా రూపురేఖలు మార్చాలన్నారు. ఇందుకోసం అధికారులు ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలన్నారు.

కలెక్టర్‌ను సన్మానిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తప్పుకోండి..!

- రేషన్ దుకాణదారులపై టిడిపి నేతల హుకుం!
- ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపునకు ఒత్తిళ్లు
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు వేధింపులు
- మార్కెట్ యార్డు పోస్టులపైనా పెత్తనం

జిల్లాలో అధికార మార్క్ ఒత్తిడి రాజకీయం నడుస్తోంది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తీవ్రత పెరుగుతోంది. టిడిపి నాయకత్వం వైసిపి ప్రభుత్వ హయాంలోకి మేము రాలేదని, మా ప్రభుత్వ హయాం నుంచి తప్పుకోవాలని హుకూం జారీ చేస్తోంది. ఆయా ప్రభుత్వ శాఖల పరిధిలో నామినేటెడ్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న కింది స్థాయి ఉద్యోగులు మొదలుకుని ఏజెన్సీల తొలగింపు రాజకీయానికి తెరలేపింది. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చీ రావడంతోనే స్కీమ్ వర్కర్ల నుంచి రేషన్ దుకాణాలు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, మార్కెట్ యార్డు కార్యాలయాల పదవులకు, పోస్టులకు రాజీనామా చేసిన స్థానాలతోపాటు ఔట్‌సోర్సింగ్ పోస్టుల్లో ఉన్న వారిని సైతం వెళ్లిపోవాలని ఒత్తిడి చేస్తోంది. వైసిపి మద్దతుదారుల స్థానాల్లో తమ పార్టీ మద్దతు దారులను నింపుకునే ప్రయత్నాలను చేసుకుంటామని చెబుతోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి కడప జిల్లాలో అధికార మార్క్ పాలన సాగుతోంది. ఉమ్మడి కడప జిల్లాలో 70 నుంచి 101 ప్రభుత్వ శాఖలు ఉన్నాయి. గ్రామీణప్రాంతాలను ప్రభావితం చేసే శాఖలపై టిడిపి దృష్టి సారించింది. రేషన్ దుకాణాలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, ఉపాధి హామీ ఫీల్డ్‌అసిసెంట్లు, మార్కెట్‌యార్డు వంటి విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ కింద పలువురు ఉద్యోగాలు చేస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో పౌరసరఫరాల విభాగం పరిధిలో సుమారు 1,750 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీరిలో పలువురు వైసిపి మద్దతు కలిగిన రేషన్ దుకాణదారులు ఉన్నారు. కూటమి సర్కారులో ప్రధానమైన టిడిపి వైసిపి మద్దతుదారులపై ఒత్తిడిని తీవ్రతరం చేస్తోంది. ఉదాహరణగా ఇటీవల కడప నగరంలో పలువురు బియ్యం వ్యాపారులను మొదలుకుని బియ్యం కాంట్రాక్టు ఏజెన్సీల నుంచి మిల్లర్ల వరకు ఎవరినీ వదలకుండా కాంట్రాక్టులను, వ్యాపారాలను వదిలి వెళ్లిపోవాలని హుకూంలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఓ పోలీస్ కాంప్లెక్స్ లీజులను పంచుకునే ప్రయత్నం చేయడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది.

ఇంతటితో ఆగకుండా గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని ఫీల్డ్ అసిస్టెంట్లపై కన్నేసింది. సుమారు 600 మంది ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉన్నారు. వీరిలో చాలామంది దశాబ్దాల తరబడి ఉపాధి హామీ పనుల్ని చేయిస్తున్నారు. ప్రతి పంచాయతీకి ఒకరు చొప్పున ఫీల్డ్‌అసిస్టెంట్లుగా వ్యవహరిస్తున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో డ్వామా వైసిపి మద్దతుదారులకు నిలయంగా మారిందనే వాదనలు ఉన్నాయి. వైసిపి హయాంలో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే విమర్శలు పెద్దఎత్తున ఉన్నాయి. ఇటువంటి వారి స్థానాల్లో ఆసక్తి కలిగిన టిడిపి మద్దతు దారులను నియమించేందుకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల వారీగా లెక్కలు సేకరించే ప్రయత్నం జోరుగా సాగుతోంది. జిల్లాలోని మూడు వేలకుపైగా ప్రభుత్వ పాఠశాలల్లో ఔట్‌సోర్సింగ్ విధానం కింద మధ్యాహ్న భోజన ఏజెన్సీల నియామకంపై టిడిపి దృష్టి సారించింది. వీటితోపాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైసిపి హయాంలో వైసిపి నాయకులు నిల్వ చేసుకున్న ఇసుక డంపులను స్వాధీనం చేసుకుని టిప్పర్ రూ.15 వేల చొప్పున అమ్ముకున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 36 మార్కెట్ యార్డులు ఉన్నాయి. వైసిపికి చెందిన చైర్మన్లు మొదలుకుని డైరెక్టర్ల వరకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. వీరి స్థానాల్లో టిడిపి మద్దతుదారులను నియమించుకునే ప్రయత్నం ముమ్మరంగా సాగుతోంది. మార్కెట్‌యార్డులో ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు కింది స్థాయి ఉద్యోగుల తొలగింపునకు ఒత్తిళ్లు చేస్తున్నారు. వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గ పరిధిలోని ట్రిపుల్‌ఐటి, జెఎన్‌టియు, కెజిబివి విభాగాల్లో పలు నియామకాలపై టిడిపి నేతలు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి ఔట్‌సోర్సింగ్ స్థానాల్లో టిడిపి మద్దతుదారులను నియమకాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

చర్చించేనా!

- ఖరీఫ్‌పై సమగ్ర చర్చ అవసరం
- ప్రశ్నార్థకంగా ఉక్కు పరిశ్రమ పనులు
- అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ ఏదీ?
- 'కొప్పర్తి' పైప్‌లైన్ ఎప్పుడో?!
- నేడు జడ్‌పి సర్వసభ్య సమావేశం

ఉమ్మడి జిల్లా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించడంపై సందేహం నెలకొంది. మంగళవారం జిల్లా పరిషత్ ఇన్‌ఛార్జి చైర్‌పర్సన్ శారద అధ్యక్షతన జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఖరీఫ్‌లో రైతాంగం ఎదుర్కొంటున్న ఎరువులు, విత్తన, అన్నదాతా సుఖీభవ నిధుల జమ వంటి సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యవసాయ, పారిశ్రామిక. విద్య, వైద్య రంగాలు ఎదర్కొంటున్న ప్రతికూల పరి స్థితులు జిల్లా ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. కడపలో రహదారుల విస్తరణ దగ్గర నుంచి జిజిహెచ్ సూపర్‌స్పెషాలిటీ భవన నిర్మాణ నాసిరకం పనులు, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ నిర్మాణ పనులు ఉక్కు పరిశ్రమ పనుల్లో పురోగతి, కొప్పర్తి పైప్‌లైన్ పనులపై ప్రశ్నించే నాథుడే కరువయ్యారు. అధికార టిడిపి నుంచి పాలకపక్ష తప్పిదాలను నిలదీసే అవకాశాలు సన్నగిల్లిన నేపథ్యంలో సమగ్ర చర్చ దేవతావస్త్రంలా మారింది. కూటమి సర్కారు అధికారంలోకి రావడం, జిల్లాలో టిడిపికి ఐదు అసెంబ్లీ, జనసేన, బిజెపిలకు ఒకటి చొప్పన సీట్లు లభించిన నేపథ్యంలో మంగళవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆసక్తికరమైన చర్చకు అవకాశం లభించనుందనే ఆసక్తి నెలకొంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ సా..గుతోంది. అన్నమయ్య జిల్లాలో క్షామపీడిత పరిస్థితులే కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లా రైతాంగ పరిస్థితులపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉరుముతోంది. ఇన్‌పుట్ సబ్సిడీ, అన్నదాతా సుఖీభవ నిధుల జమ వంటి పలు అంశాలపై చర్చించాల్సి ఉంది.కెసి కెనాల్ చివరి ఆయకట్టు వరకు నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించాల్సి ఉంది. కడప నగరంలో రహదారుల విస్తరణ సా...గుతూనే ఉన్నాయి. కడప నగరంలోని ముంపు ప్రాంతాల పరిరక్షణకు ప్రకటించిన స్ట్రోమ్ డ్రెయిన్ పనుల్ని పట్టాలకు ఎక్కించాల్సి ఉంది. అన్నమయ్య, గండికోట నిర్వాసితుల మొర, పింఛా, ఎల్‌ఎస్‌పి గేట్ల మరమ్మతులు, సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలోని లింగాల కాల్వ లీకేజీ, యురేనియం పైప్‌లైన్ పనుల పురోగతిపై ప్రధానంగా దృష్టి సారించాల్సి ఉంది. 2021 నవంబర్ వరదల్లో అన్నమయ్య రిజర్వాయర్ మట్టికట్ట తెగిన సందర్భంగా సుమారు ఆరు గ్రామాల ప్రజానీకం నిర్వాసితులుగా మారిన సంగతి తెలిసిందే. అప్పట్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్వాసితులను ఆదుకుంటామని హామీ నిచ్చారు. ఇప్పటికీ హామీలో ఆశించిన పురోగతి కొరవడింది. పింఛా, ఎల్‌ఎస్‌పి గేట్లకు మరమ్మతులు, సర్వరాయసాగర్, బ్రహ్మసాగర్ లీకేజీల పరిష్కారం, యర్రబల్లి-పార్నపల్లి పైప్‌లైన్ పనుల్లో ఆలస్యం కారణంగా యురేనియం నిర్వాసిత గ్రామాలకు తాగునీటి సమస్య ఎప్పటికి పరిష్కా రమవుతుందో తెలియడం లేదు. గండికోట నిర్వాసితులకు రూ.ఏడు లక్షల పరిహారానికి అదనంగా మరో రూ.మూడు లక్షలను అందిస్తామని ఇచ్చిన హామీని నిలు పుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా జీవనాడిగా మారిన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం మారి టిడిపి, జనసేన, బిజెపి కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో ఉక్కు పనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారనుందా అనే సందేహం వెంటాడుతోంది. 2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట తాము అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలులో వైఫల్యం జిల్లా ప్రజలకు శాపంగా మారింది. గతేడాది ప్రారంభంలో జెఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పనులను ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు ఆశించిన పురోగతి కనిపించకపో వడం ఆందోళన కలిగిస్తోంది. కొప్పర్తికి రూ.150 కోట్ల నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందో తెలియడం లేదు. ఫలితంగా జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు వలసలు వెళ్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికైనా జిల్లా పరిషత్ పాలకవర్గం జిల్లా సమగ్రాభివృద్ధిపై అర్థవంతమైన చర్చ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పడంలో సందేహం లేదు.

వైఎస్‌ఆర్‌కు నివాళులర్పించిన జగన్, షర్మిల

తల్లితో కలిసి వేర్వేరుగా ఇడుపులపాయలో ప్రార్థనలు

ఇడుపులపాయలో తండ్రి సమాధికి నివాళ్ళు ఆర్పిస్తున్న మాజీ సిఎం జగన్

ప్రజాశక్తి-వేంపల్లె

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు సోమవారం వైఎస్‌ఆర్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వైఎస్‌ఆర్ జిల్లా వేంపల్లె మండలం ఇడుపులపాయలోని వైఎస్‌ఆర్ సమాధి వద్ద తల్లి విజయమ్మ, భారన్య వైఎస్.భారతి, ఇతర కటుంబ సభ్యులతో కలిసి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల వేర్వేరుగా నివాళులర్పించారు. అక్కడే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో చివరి రోజు జగన్ పులివెందుల నుండి 7.55 నిమిషాలకు ఇడుపులపాయకు జగన్ మోహన్‌రెడ్డి రాగా అప్పటికే ఘాట్ వద్ద తల్లి విజయమ్మ పది నిమిషాలు పాటు ఘాట్ వద్ద ప్రార్థనలు చేసిన మాజీ సిఎం సమీపంలోని వైఎస్‌ఆర్ విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు. అనంతరం అక్కడికి వచ్చిన వైసిపి కార్యకర్తలు, నాయకులను జగన్ పలకరించారు. అనంతరం ఇడుపులపాయలోని గెస్ట్‌హౌస్‌కు వెళ్లకుండా నేరుగా వైఎస్‌ఆర్ ఘాట్ వద్ద నుండి రోడ్డు మార్గంనా కడపకు బయలుదేరి వెళ్లారు. మాజీ సిఎం జగన్ ఘాట్ వద్ద నుండి వెళ్లిన తర్వాత 8.45 నిమిషాలకు పిసిసి అధ్యక్షులు షర్మిల తన భర్త అనిల్ కుమార్, తల్లి విజయమ్మ, కుమార్తె అంజలి, కుమారుడు రాజారెడ్డి, కోడలు అట్లూరి ప్రియా, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డితో కలిసి వైఎస్‌ఆర్ ఘాట్ వద్దకు విచ్చేశారు. షర్మిల అరగంట పాటు ప్రత్యేక ప్రార్థనలు చేసి పూలమాలలతో నివాళులర్పించారు. సమీపంలోని వైఎస్‌ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం షర్మిల విలేకరులతో మాట్లాడుతూ వైఎస్‌ఆర్ ఒక డైనమిక్ లీడర్ అన్నారు. నాయకుడు అంటే ఎలా ఉండాలని ఆదర్శంగా నిరూపించిన నాయకుడు వైఎస్‌ఆర్ అని పేర్కొన్నారు. గొప్ప పరిపాలన అందించాడు కాబట్టే ఆయన మరణానంతరం వైఎస్‌ఆర్ వెనకాల 700 మంది చనిపోయినట్లు తెలిపారు. వైఎస్‌ఆర్ గురించి చెప్పాల్సిన అవసరం లేదన్నారు. మాజీ సిఎం ఇడుపులపాయకు రావడంతో దారిపొడవున పోలీసులు గస్తీ నిర్వహించారు. ఘాట్‌లోకి ఎక్కువ మందికి పోలీసులు అనుమతించలేదు. సిఎం హోదాలో ఉన్న సమయంలో ఇడుపులపాయలో ఎన్ని చెక్ పోస్టులు పెట్టారో అదే మాదిరిగా చెక్ పోస్టులు పెట్టి పోలీసులు తనిఖీలు చేశారు. మాజీ సిఎం జగన్ వెంట కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, అరకు ఎంపీ తనూజా రాణి, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా, రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, గోవింద్‌రెడ్డి, రమేష్ యాదవ్, మాజీ మంత్రి ఉషశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, రఘురామిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, ఆర్టీసీ మాజీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, మాజీ సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్ ఉన్నారు. షర్మిల వెంట పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ధృవకుమార్‌రెడ్డి, ఇర్ఫాన్‌బాష, సలావుద్దీన్, విజయ జ్యోతి, అఫ్జల్‌ఖాన్‌తో పాటు ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ముఖ్య నేతలు పాల్గొన్నారు.

తండ్రి సమాధి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పిస్తున్న పిసిసి చీఫ్ షర్మిల

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పిజిఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందిన అర్జీలను ప్రాధాన్యతగా ఎప్పటికప్పుడూ బాధ్యతాయుతంగా నూరు శాతం పరిష్కరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా మండల, డివిజన్ స్థాయిలలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యపై అవగాహన కలిగించుకొని పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు జెసి ఫర్మన్ అహ్మద్‌ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణరావు, ఎస్‌డిసి రామసుబ్బయ్య ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఎండార్స్‌మెంట్ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలను స్వీ కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం వల్ల పేద విద్యార్థులు ఉన్నతమైన స్థానాలు చేరుకోగలుగుతున్నారని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం బాలాజీ నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలు బలపడడానికి ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో, స్వేచ్ఛగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు అందరి అభిప్రాయాలు తెలుసు కుంటానన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించడంలో మా ప్రభుత్వం ముందుం టుందన్నారు. విద్యార్థులు ఇష్టంగా చదివి తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం గత రెండేళ్లగా పదవీ విరమణ చేసి నిస్వార్థంగా బోధిస్తున్న విశ్రాంతి ఉపాధ్యాయులను అంకితభావాన్ని ఎమ్మెల్యే కొనియాడారు. నిస్వార్థంగా ఉచిత విద్యనందిస్తున్న పాలగిరి విశ్వప్రసాద్, ఆనంద నాయుడు, సరోజలను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీవైఈఓ పురుషోత్తం, ఎస్‌టియు అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల మధుసూదన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్ధన్, ఉపాధ్యాయులు అమర్నాథ్, ఈశ్వర్ నాయక్, శైలశ్రీ, ఆనంద్, మహమ్మద్ ఖాన్ మరియు తెలుగుదేశం నాయకులు విద్యాసాగర్, గుర్రప్ప నాయుడు, నాగరాజు, అరుణ్ కుమార్, శామీర్ భాష, నారాయణస్వామి పాల్గొన్నారు.

'వెలుగు'లో 27వ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని కోళ్ళబైలు పంచాయతీ, అమ్మచెరువు వెలుగు సంస్థలో సోమవారం సంస్థ 27వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి స్వర్గీయ పద్మజ పాలరాతి విగ్రహానికి పూల మాలలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 1997లో స్వర్గీయ పద్మజ ఆశయాల మేరకు స్వర్గీయ టి.ఎన్.రఘునాథ్‌రెడ్డిచే 15 మంది దివ్యాంగులతో మదనపల్లె, బెంగుళూరు రోడ్‌లో వెలుగు సంస్థను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం అమ్మచెరువుమిట్టలో 145 మంది దివ్యాంగులు, మూగబధిరులు, వృద్ధులకు సేవలందించడం మా పూర్వజన్మ సుకృతమన్నారు. టి.ఎన్.రఘునాథ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, కడప కోటిరెడ్డి కుమారుడు రిటైర్డ్ ప్రినిపల్ సెక్రటరీ జయభారత్‌రెడ్డి, అధికారులు, పత్రిక విలేఖరులు, స్వచ్ఛంద సేవాసంస్థల ఇలా పలువురి దాతల సాయం వల్ల వెలుగు సంస్థలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సిబ్బందికి, పిల్లలకు, వృద్ధులకు పంచిపెట్టారు. ఆర్యవైశ్య సమాజం స్టేట్ సెక్రటరీ నాగరాజు కుమారుడు వెంకట కార్తీక్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. మా ఆర్యవైశ్య సమాజం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ లీనాకుమారి, సిబ్బంది, పిల్లలు, వృద్ధులు పాల్గొన్నారు.

వెలుగు ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులు

గుండెపోటుతో ఆలయ ధర్మకర్త మృతి

ప్రజాశక్తి - గాలివీడు

స్థానిక పంచాయతీలోని బలిజపల్లి ఆసర్ల గంగమ్మ ఆలయ ధర్మకర్త కేడం జయరాములు (62) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మృతునికి భార్య రమణమ్మ , కుమారుడు, కోడలు, కుమార్తె, అల్లుడు, మనవడు, మనవరాలు ఉన్నారు. సోమవారం సాయంత్రం బలిజపల్లి వద్ద దాన కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మకర్త మృతి వార్త విన్న టిటిడి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, జయరాములు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎరువుల దుకాణాల్లో ఏడీ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి కలికిరి

పట్టణంలోని ఎరువుల దుకాణాలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికా రులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. సోమ వారం స్థానిక పట్టణంలో కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎడి ఎన్.సాలురెడ్డి, ఎస్ఐ రామకృష్ణ నాయక్ కలికిరి పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి రికార్డు సక్రమంగా లేని సిరి ఆగ్రో ఎరువుల దుకాణంలో ఎరువుల విక్రయాలు నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మమతారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న ఏడీ

వ్యాపారులకు న్యాయం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద వివిధ వ్యాపారాలు సాగించే వ్యాపారస్తుల వద్ద జూన్-2 కింద పన్నులు వసూలు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ మోహన్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ 2014లో ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పడ్డాక ప్రజలు ఫ్లై ఓవర్‌పై ప్రయాణిస్తుండడంతో బ్రిడ్జి కింద ఉన్నవారికి వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, వారిని జూన్-1 కింద పన్నులు చెల్లించాలంటే తలకు మించిన భారమవుతుందని తెలిపారు. బ్రిడ్జి కింద వ్యాపారులను జూన్-2 పరిధిలోకి తీసుకురావాలని కోరారు.

ఆర్‌డిఒకు వినతి పత్రం సమర్పిస్తున్న వ్యాపారులు

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

రాయచోటి : కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా సోమవారం రాయచోటి పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష , కౌన్సిలర్లు, నాయకులతో కలిసి అయన పాల్గొన్నారు. బస్ స్టాండ్ సర్కిల్ లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పట్టణంలోని వైఎస్ఆర్ సిపి కార్యాలయంలో భారీ కేక్ ను కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ హయాంలో అభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు. ఆరోగ్యశ్రీ, 108, 104, అర్హులందరికీ ఇళ్ళు, ఉచిత విద్యుత్, రుణ మాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలిమి హారూన్ బాష, ఫయాజ్ అహమ్మద్, కొలిమి చాన్ బాష, రౌనక్, గౌస్ ఖాన్, పట్టణ అధ్యక్షుడు రియాజుర్ రెహమాన్, జానం రవీంద్ర యాదవ్, సుగవాసి శ్యామ్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి ఇంతియాజ్, అజ్మతుల్లాఖాన్, ఫైరోజ్, అష్రఫ్ పాల్గొన్నారు. **రామాపురం :** ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహాలకు గజ మాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్, మాజీ ఎంపిపి గడికోట జనార్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, ఎంపిటిలు, మాజీ ఎంపిటిసిలు, సర్పంచులు, మాజీ సర్పంచులు వైసిపి నాయకులు, పాల్గొన్నారు. **సుండుపల్లి :** మండలం కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పార్టీ మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఇసిప నాయకులు రహిమాన్, బాబురెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయంలో కార్యకర్తలు, అభిమానుల మధ్య మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల చేసి నివాళు లర్పించి అనంతరం కేక్ కట్ చేసి, టోల్గేట్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు బ్రెడ్లు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పంజం సుకుమార్‌రెడ్డి, గుత్తిరెడ్డి హరినాధరెడ్డి, సిడి నాగేంద్ర యాదవ్ మండల కన్వీనర్లు సాయి కిషోర్‌రెడ్డి, సుధాకర్ రాజు, జడ్‌పిటిసి రత్నమ్మ, సర్పంచ్ శివయ్య ఉప సర్పంచ్ శివసాయి, సిహెచ్ రమేష్, షఫీ, రాజ, సర్పంచ్‌లు చెంగల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దార్ల చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం రాజు, కొప్పల శంకరయ్య ముజీబు, రిటైర్డ్ డిఎస్‌పి సుబ్బారావు, అన్వర్ భాష, కరిముల్లా, నాయకులు రాజేశ్వరి, అరుణ, లత పాల్గొన్నారు. **బి.కొత్తకోట:** వైసిపి మండల కన్వీనర్ ప్రదీప్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ సి.ఆర్ చిన్నికృష్ణ ఆధ్వర్యంలో జ్యోతి చౌక్ బస్టాండ్‌లో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలవేసి కేక్ కట్ చేసి పంపిణీ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయుబ్ భాష, కో-ఆప్షన్ మెంబర్ నాసర్, నాయకులు నరసింహనాయుడు, ఫయాజ్, సద్దాం, పాగొండ రఫీ, మండల సోషల్ మీడియా కన్వీనర్ పవన్, మాజీ కో-ఆప్షన్ మెంబర్ అమీర్ సాబ్, ఇందిరమ్మ కాలనీ విక్కి, బాబు పాల్గొన్నారు. **రామసముద్రం :** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కలికిరి:** వైఎస్ఆర్ జయంతి వేడుకలను సహకార బ్యాంకు మాజీ అధ్యక్షులు నల్లారి తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పల్లవోలు మాజీ సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి, వేంపల్లి బావాజీ, సీనియర్ నాయకులు మద్దిరాళ్ళ మల్లికార్జున, వేంపల్లి ఖాదర్‌బాషా, వార్డు సభ్యులు కాంతమ్మ, విశ్వనాథ్, రఘు సిద్దు, షామీర్, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. **కలకడ:** మండల కేంద్రమైన కలగడలో వైఎస్ఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, ఉప సర్పంచ్ అక్రమబాష, మస్తాన్, అహ్మద్ షకీల్, అహ్మద్, కరీముల్లాబాష, జిలాని బాష పాల్గొన్నారు. **నందలూరు:** మండల కన్వీనర్ సిద్దవరం గోపిరెడ్డి, జడ్‌పిటిసి ప్రతినిధి గడికోట వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలి సమీపంలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ళ త్రినాథ్, మండల పార్టీ మహిళ అధ్యక్షులు పల్లె మాధవి, గంపా సుధాకర్, జాఫర్ బేగ్, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, నడివీధి సుధాకర్, ఉప సర్పంచ్ ఇబ్బు, గుండు మల్లికార్జునరెడ్డి, భాస్కర్ యాదవ్, ఆనాల మధు యాదవ్, సోమిశెట్టి ప్రభాకర్, అరిగే నాని, పెనుబాల నాగసుబ్బయ్య, కాకిచంద్ర, షావల్లి, మహబూబ్ బాషా, నారాయణ, ఎముక దుర్గయ్య, ఆకేపాటి రమేష్‌రెడ్డి, ఎంపిటిసి శివయ్య, అస్తవరం సుబ్బరామిరెడ్డి, మోడపోతుల సుధాకర్, పల్లె నాగయ్య, పఠాన్ అక్బర్ ఖాన్, పనతల గంగయ్య, నవాబు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసులు

ఎన్నికలకు ఉపయోగించుకున్న వాహన బిల్లులు చెల్లించాలని ధర్నా

నిరసన తెలుపుతున్న వాహన డ్రైవర్లు, ఓనర్లు

ప్రజాశక్తి-మదనపల్లి : సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల విధులకు ఆర్‌డిఒ ఆదేశాలతో మదనపల్లి, తంబళ్లపల్లి నియోజకవర్గాలలో వాహనాలను అమర్చామని, ఇప్పటివరకు చెల్లించలేదని మదనపల్లె నవ యువ కార్ డ్రైవర్, ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ సాహెబ్ వల్లి, వాహబ్ స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ హరిప్రసాద్‌కు వింత పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రెండు నియోజకవర్గాలలో దాదాపు 100 వాహనాలను ఎన్నికల విధులకు ఏర్పాటు చేశామన్నారు. మదనపల్లి డివిజన్లో చెల్లించాల్సిన అద్దె రూ13,28,210, తమ్మళ్ళపల్లి డివిజన్‌లో చెల్లించాల్సిన అద్దె రూ15,02,020 చెల్లించాలని కోరారు. బడ్జెట్ రాగానే చెల్లించేందుకు కోసం చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జోహార్, వెంకటరమణ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'అంబేద్కర్ గురుకులం సమస్యలు పరిష్కరించండి'

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం సమస్యలు పరిష్కరించాలని ప్రజా వేదికలో తహశీల్దార్‌కు హ్యూమన్ రైట్స్ రాయలసీమ జిల్లాల కన్వీనర్ షేక్ మొహమ్మద్ రఫీ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ గురుకులం ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ స్థానికంగా నివాసం ఉండకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. 2023-24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి విద్యార్థులు దాదాపు 20 మంది ఫెయిల్ అయ్యారన్నారు. కొందరు రెగ్యులర్ టీచర్లు స్టడీ అవర్స్ నైట్ డ్యూటీలు చేయకుండా గెస్ట్ టీచర్లతో చేస్తున్నారున్నారు. మౌఖిక ఆదేశాలతో స్పెషల్ టీచర్లకు క్యాంపస్ ఇన్‌ఛార్జి ఇవ్వడంపై జిల్లా సమన్వయ అధికారి మాధవి లత దృష్టికి తీసుకెళ్లిన ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌పై ఎటువంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. సమన్వయ అధికారి సియుజి చరవాణి నెల రోజుల నుంచి పనిచేయకపోవడం దారుణమైన విషయమని తెలిపారు. లక్కిరెడ్డిపల్లి గురుకుల పాఠశాల చాలా వరకు దెబ్బతిని పడిపోయిందని రక్షణ లేకుండా పోయిందని ఇన్చార్జి ప్రిన్సిపల్ సెక్యూరిటీ సిబ్బందిని తగ్గించి వేశారని సెక్యూరిటీ రూమ్ అసంపూర్తిగా నిర్మించారని ప్రజాసంఘాలు నాయకులు ప్రశ్నిస్తే వారిమీదికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎదురుదాడి దిగుతూ పొంతనలేని సమాధానాలు చెబితే కాలయాపన చేస్తున్నారని తక్షణమే పై స్థాయి అధికారులు చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రఫీ

'వాసివాడి తస్సాదియ్య'ను ఆదరించండి

ప్రజాశక్తి - రాయచోటి

సాహితీ క్రియేషన్స్ బుడ్డ గాడు హోమ్ ప్రొడక్షన్ సమర్పించు కొర్లగుంట కళ్యాణ్ దర్శకత్వంలో తీస్తున్న చిత్రం వాసివాడి తస్సాదియ్య చిత్రాన్ని ఆదరించాలని యూత్ ఐకాన్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం పట్టణం లోని శివాలయంలో చిత్రాన్ని క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నేతృత్వంలో వస్తున్నచిత్రం వాసివాడి తస్సాదియ్య అని పేర్కొన్నారు. చిత్రంలో బుడ్డ గాడు, యూట్యూబ్ ఇన్ఫ్యులెన్సర్ పిఆర్ మ్యూజికల్ ప్రజ్వల్, డెవిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ చిత్రం విజయవంతంగా షూటింగ్ చేసుకోవాలని నటీనాటులందరికీ ముందుగా వినయ్ కుమార్ ముందస్తు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నటీనటులు ప్రవీణ్ కుమార్, ఆలీ, నాగలక్ష్మి, ధనుష్, భాను ప్రకాష్, తహీర్,అమీర్, మారుతి పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం

ప్రజాశక్తి -వీరబల్లి

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజంలో చెడు ప్రభావాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. మంచిగా మెలగాలని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. యువత, విద్యార్థులు చట్టాల పైన అవగాహన పెంచుకొని జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించాలని చెప్పారు. బాలికలు గృహహింస నిరోధక చట్టం, విద్య హక్కు చట్టం, దిశా చట్టం సమాచార హక్కుచట్టం, పౌరసత్వ చట్టం గురించి తెలుసుకోవాలన్నారు. సమాజంలో ఉండేటటువంటి రుగ్మతల తొలగించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో లాయరు సుంకు రవీంద్ర, కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ రఘురామయ్య, ప్రిన్సిపల్ అజంతుల్లా, హిస్టరీ లెక్చరర్ భాస్కర్ పాల్గొన్నారు.

పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి

ప్రజాశక్తి-కలికిరి

పశువులకు ఎక్కువ మోతాదులో పశుగ్రాసం అందిస్తేనే పాలు దిగుబడి పెరుగుతుందని పశు వైద్య సంచాలకులు వెంకట ముని నాయుడు తెలిపారు. సోమవారం టి.చంద్ర వారిపల్లె, కలికిరి మండలం రైతు సేవా కేంద్రం నందు పశు గ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప సంచాలకులు సత్యనారాయణ, ముఖ్య అతిథిగా విచ్చేసి పశు గ్రాశ వారోత్సవాలు జూలై 7న ప్రారంభమై 14 వరకు జరుగుతాయని చెప్పారు. పచ్చి మేత మేపు అధిక పాల దిగు బడిలో ముఖ్య భూమిక పోషిస్తుంది అని చెప్పారు. వివిధ రకాల పశు గ్రాస నమూనాలను రైతులకు చూపించి వాటి విలువను రైతులకు వివరించారు. గడ్డి కొరత సమయాల్లో అక్కరకొచ్చే పాతర గడ్డి తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. డాక్టర్ వెంకటముని నాయుడు, సహాయ సంచాలకులు, కలికిరి మండలం పప్పు జాతి గడ్డి మేపు వలన పశువులకు కలిగే మేలు గురించి రైతులకు వివరించారు. ఏడాదికి ఒక దూడను పశువు ఈనాలంటే సమతుల్య పోషణ అవసరమని చెప్పారు. సరైన పచ్చి మేపు లేకపోతే పశువులకు జరిగే నష్టాన్ని గురించి విపులంగా వివరించారు. కార్ర్యమంలో మునేల్ల పల్లె సర్పంచ్ శశికళ, టి.చంద్రవారిపల్లి సర్పంచ్ జహీద, పంచాయతి ఇన్‌ఛార్జి గంగాధర్ పాల్గొని ప్రభుత్వం తరపున సబ్సిడీ ద్వారా లభ్యమవుతున్న గడ్డి విత్తనాలను అందరూ కొని సాగు చేసుకోవాలన్నారు. ఆదర్శ రైతు అషాక్ అహ్మద్ ద్వారా దశరథ గడ్డి, స్టయిలో హేమాట గడ్డి విత్తనాలను రైలకు సరఫరా చేయించారు. డాక్టర్ గిరినాథ రెడ్డి, పశువైద్యులు, పాలెం, పశు వైద్య సహాయకులు వాసుదేవరెడ్డి, రాజుకుమార్ పాల్గొన్నారు.

గోడౌన్‌లో స్టాక్‌ను పరిశీలిస్తున్న డిఇఇ దీన్‌దయాల్‌రాజు

గృహ నిర్మాణ గోడౌన్‌లో డిఇఇ తనిఖీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పక్కా గృహ లబ్ధిదారులకు గృహ నిర్మాణ వస్తువులు అందు బాటులో ఉన్నాయని మదనపల్లి గృహ నిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి డిఇఇ దీన్ దయాల్‌రాజు అన్నారు. సోమవారం నిమ్మనపల్లిలోని హౌసింగ్ గోడౌన్‌ను స్థానిక హౌసింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోనీ హౌసింగ్ గోడౌన్‌లో ఉన్న వస్తువుల స్టాక్‌ను పరిశీలించామన్నారు. మండలంలో జరుగుతున్న పక్కా గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయటానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. పక్కా గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం గృహ నిర్మాణానికి కావలసిన కిటికీలు, ముఖ ద్వారాలు, విద్యుత్ సామగ్రి, సిమెంటు, కమ్మి తదితర వస్తువులను అందిస్తున్నాదని పేర్కొన్నారు. లబ్ధిదారులకు అవసరమైన గృహ నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉన్నాదని, అవసరమైన లబ్ధిదారులు హౌసింగ్ అధికారులను సంప్రదించి వస్తువులను తీసుకొని త్వరగా గృహ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. హౌసింగ్ ఎఇ అమర్నాథ్, వర్క్ఇన్‌స్పెక్టర్ అనూష, కంప్యూటర్ ఆపరేటర్ రవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆకుకూర తోటను పరిశీలిస్తున్న వరలక్ష్మి

పొద్దుతిరుగుడు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని రాఘవరాజుపురం సచివాలయంలో నియోజనవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి సచివాలయం సిబ్బందితో కలిసి రైతులకు ఉచిత పొద్దుతిరుగుడు విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం రాఘవరాజుపురంలో సేంద్రియ వ్యవసాయ ద్వారా సాగు చేస్తున్న ఆకుకూరలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి మహేష్, వేణుగోపాల్‌రెడ్డి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మనోహర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కలెక్టర్‌గా శ్రీధర్ చామకూరి బాధ్యతలు చేపట్టిన సంగతి విధితమే. సోమవారం బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనరు పి.ఆర్. మనోహర్ కలెక్టరేట్ లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అంద జేశారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ప్రొటోకాల్ ప్రకారం కలెక్టర్‌ను కలిశామన్నారు. సూచనలు, సలహాలు స్వీకరించారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఎఇ రాజేంద్ర పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సెలవులివ్వాలని వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సచివాలయ ఉద్యోగులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రమీల వినతి పత్రం అంద చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు జులై నుంచి ఇవ్వాల్సిన వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరారు. అర్జిత సెలవులను ఎస్ఆర్ రిజిస్టర్ నందు నమోదు చేసి హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లో అప్డేట్ చేయాలని కోరారు. బిఎల్ఒలకు మూడు సంవత్సరాలకు ఇవ్వాల్సిన రెమ్యూరేషన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, నాయకులు సతీష్, ప్రసాద్, రవీంద్ర నాయక్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

CHANGE OF NAME

I, Chennareddygari Subbamma (Old Name) w/o Chennareddygari Subramanyam,R/o 2/33 Choppavaripalli v , konmanavaripalli post, Pullampeta mandal ANNAMAYYA (Dist), AP. I have been changed my name as Mallu Rathanamma reddy W/o Mallu Narasa reddy (New Name).

మహారాజశ్రీ గౌరవనీయులు ప్రధాన సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) రాజంపేట
A.S.NO : 5/2024
IN
(A.S.NO.18/2022 3rd ADJ /RJP)
గోపవరం కృప. ...అప్పిలెంట్
V/S
1.కాలువజయరామిరెడ్డి (R1) గాంధీ నగర్, బద్వేల్ (పోస్టు)
2. బిజవేముల జయ లక్ష్మమ్మ (R2) W/o రామిరెడ్డి, చెన్నకేశం పల్లి, బద్వేల్ (పోస్టు)
3. కాలువ రాజగోపాల్ రెడ్డి (R3), S/o రామస్వామి రెడ్డి, R/O బేతాయపల్లె, గోపవరం మండలం.
4. కాలువ జయమ్మ (R6), W/o late రామిరెడ్డి, R/O ఆంజనేయ నగర్, బద్వేల్. ...రెస్పాండెంట్లు

నోటీసు

పై చెప్పిన అపీలు దావా మరియు స్టే ఆర్డర్ పిటిషన్, రెస్పాండెంట్లు 1,2,3 మరియు R6కు ఆక్షేపణలు తెలుపుటకు పై చెప్పిన కోర్టులో 18-07-2024 వ తేదీ ఉదయం 10:30 గంటలకు వాయిదా ఉన్నది. పై కోర్టులో మీరు స్వయంగా గాని, లేదా కౌన్సిల్ ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేనంతట మీ పరోక్షమున ఎక్స్ పార్టీ ఉత్తర్వులు పాలించబడునని మీకు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

//By order of the court//
A.వెంకటసుబ్బయ్య, B.Sc., B.A., BL., అడ్వకేట్ & నోటరీ,
R.పెంచలయ్య, B.Com., L.L.B.., అడ్వకేట్స్ రాజంపేట.

CHANGE OF NAME

I , Chennareddygari Prasad reddy (Old Name),S/o Chennareddygari subramanyam, R/o 2/33 Choppavaripalli v, konmanavaripalli post, Pullampeta mandal ANNAMAYYA (Dist), AP.

I have been changed my name as Mallu Prasad reddy S/o Mallu Narasareddy (New Name).

CHANGE OF NAME

I , Chennareddygari Sujatha (Old Name) w/o Chenna reddygari Prasad Reddy,R/o 2/33 Choppavaripalli v , konmanavaripalli post, Pullampeta mandal ANNAMAYYA (Dist), AP.

I have been changed my name as Mallu Latha W/o Mallu Prasad reddy (New Name).

డయేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ముందస్తు జాగ్రత్తలతో డయేరియా, డెంగీ దూరం

ప్రజాశక్తి-కలికిరి

ముందస్తు జాగ్రత్తలతో డయేరియా డెంగీ వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని మెడికుర్తి సిహెచ్‌సి వైద్యులు చిన్నారెడ్డెప్ప తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వారి ఆదేశాల మేరకు కలికిరి మండలంలోని గుండ్లూరు, ఎర్రదొడ్డిపల్లి గిరిజన కాలనీ, ఉల్సారపల్లి గ్రామాల్లో మెడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ చిన్నారెడ్డెప్ప పర్యవేక్షణలో డయేరియా, డెంగీ వ్యతిరేక మాసోత్సావాలు, పెద్దల బిసిజి టీకాలపై హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ సోమ, గురువారాలలో అన్ని ఆరోగ్య కేంద్రా ల్లో అర్హులైన ఆరు వర్గాలవారికి బిసిజి టీకాలు వేస్తున్నామని ఈ కార్యక్ర మాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ముఖ్యంగా చేతులు శుభ్రత పాటించాలని, తాగు నీటిని కాచి చల్లార్చి తాగాలని, వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని తెలిపారు. ఒఆర్ఎస్ ప్యాకెట్స్ అన్ని ఆరోగ్య, అంగన్వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒఆర్ఎస్ ద్రావణాన్ని ఎలా తయారు చేయడం తెలిపారు. అనంతరం డెంగీ జ్వరాలు ప్రబలకుండా ఫ్రైడే డ్రై డే పాటించాలని, కిటికీలకు మెష్ కొట్టించుకోవాలని, ఇంటి పరిదరాలలో నీరు నిల్వ లేకుండా చేసుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి నాగరాణి, ఎఎన్ఎం ప్రభావతి, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : 'ఆకేపాటి'

ప్రజాశక్తి- రాజంపేట అర్బన్

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని శ్రీ చైతన్య ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆర్ఎస్ రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఇండియా మిషన్ ఆర్ట్ అనే నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం, మొక్కల పెంపకం యొక్క ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. చెట్లు లేనిదే మనిషి మనుగడ అసాధ్యమని పేర్కొన్నారు. ప్రాణవాయువు మొక్కల ద్వారానే అందుతుందని, చెట్లు నరకడం వలన కరువు కాటకాలు సంభవించి తీవ్ర విపత్తులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అనూష, అకడమిక్ డీన్ వెంకటసుబ్బయ్య, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, ప్రైమరీ ఇన్‌చార్జి కస్తూరిబాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెటర్నరీ, డిప్లమో కోర్సులకు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - రాయచోటి

2024-25 ఏడాదికి గానూ వెటర్నరీ డిప్లమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 8న నోటిఫికేషన్ విడుదలైందని అర్చన వెటర్నరీ, డిప్లమా కళాశాల కరస్పాండెంట్ పి .మదనమోహన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. వెటర్నరీ, డిప్లొమా కోర్స్‌కు శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వ విద్యాలయం, (తిరుపతి), నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. . 10 వ తరగతి పాసైన, ఇంటర్ ఫెయిల్ అయన విద్యార్థులు వెటర్నరీ పాలిటెక్నిక్ రెండు సంవత్సరాల కోర్సులో చేరేందుకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఈనెల 22 వరకు online www.svvu.edu.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గత సంవత్సరం అర్చన విద్యా సంస్థలో చదివిన విద్యార్థులకు 31 మందికి వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు వచ్చాయని, ఈ ఘనత సాధించిన ఏకైక విద్యా సంస్థ తమదే అని అన్నారు.

బాధితుడితో మాట్లాడుతున్న ఎస్‌పి కృష్ణారావు

ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఫిర్యాదుదారుల సమస్యలను త్వరగతిన పరిష్కరిస్తామని ఎస్‌పి బి.కృష్ణారావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్‌పి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కార వేదిక ద్వారా వచ్చిన 53 ఫిర్యాదులపై, వాటిని సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కార మార్గం చూపించాలని ఆదేశించారు. వికలాంగులు, వద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

డిగ్రీ కోర్సులకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- కళాశాల ప్రిన్సిపల్ అంజలిదేవి

ప్రజాశక్తి -కలికిరి : విద్యార్థులు డిగ్రీ కోర్సు చదవడానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరని ఎస్‌డబ్ల్యూఆర్ ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.అంజలీదేవి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పూర్తి అయిన విద్యార్థినిలు డిగ్రీ కోర్స్ చేయడానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్స్ మూడు రోజుల(2.7.2024)నుండి జరుగుతున్నాయన్నారు. నూతన విద్యావిధానం ద్వారా కలికిరి కళాశాలలో కొత్త కోర్సులు కూడా రావడం జరిగిందని వివరించారు. తమ కళాశాలలో బి.కాం జనరల్ హానర్స్, బి.కాం హానర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్, బి.ఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్, బి.ఎస్సీ హానర్స్ బోటనీ లాంటి కోర్సులు ఉన్నాయని ప్రతి ఒక్కరూ జులై 10వ తేదీ సాయంత్రం లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. 11వ తేదీ మధ్యాహ్నం నుండి వెబ్ ఆప్షన్ పెట్టుకోవచ్చని, తమ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, కళాశాలలో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య లభిస్తుందని, మన రాష్ట్రంలో ఇలాంటి కళాశాల ఉన్నది రెండు మాత్రమే అందులో ఒకటి కంచికచెర్ల, మరొకటి కలికిరి కళాశాల మాత్రమే అని ఈ అవకాశాన్ని పీలేరు నియోజకవర్గ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షా ఫలితాలలో తమ కళాశాల వందకు వంద శాతం ఉత్తీర్ణులవుతున్నారని, విద్యార్థులు తమకు కావల్సిన కోర్సులను ఎంపిక చేసుకొని తమ కళాశలలో చేరవచ్చని తెలియజేశారు.